సాక్షి
గుంటూరు

శుక్రవారం । 14 । జూలై । 2023



దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ

విజయవాడ : ఇంద్రకీలాద్రిపై ఆషాఢ సారె మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఏడు వందల మంది భక్తులు గురువారం అమ్మవారికి సారెను సమర్పించారు.



ఘనంగా ఆడికృత్తిక మహోత్సవం

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆషాఢ ఆడికృత్తిక మహోత్సవం సందర్భంగా గురువారం అమ్మవార్లు శాకంబరిగా దర్శనమిచ్చారు.

16న పెద్దింటమ్మ తల్లికి ఆషాఢ బోనాలు



అమరావతి: అమరావతి గ్రామ దేవత పెద్దింటమ్మ తల్లికి ఆదివారం ఆషాఢ మాసం భోనాలు సమర్పిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. స్థానిక మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా పెద్దింటమ్మ గుడికి చేరుకుంటారన్నారు.

న్యూస్‌రీల్


సంచార పశు ఆరోగ్య రథాల్లో ఉద్యోగాలు

గుంటూరు మెడికల్ : జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవా రథాల్లో పైలెట్, డాక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పశు ఆరోగ్య సేవా రథాల జిల్లా మేనేజర్ ఎస్.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్లుగా పనిచేయడానికి బ్యాచ్‌లర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. పైలెట్ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు, మూడేళ్ల అనుభవం ఉండాలన్నారు. డాక్టర్ పోస్టులు ఐదు, పైలెట్ పోస్టులు 15 ఉన్నాయని, ఆసక్తి, అర్హత ఉన్నవారు 96188 36074 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు కలెక్టరేట్‌లో నవోదయం కార్యక్రమం

నరసరావుపేట: కలెక్టరేట్ ప్రాంగణంలో శుక్రవారం నవోదయం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గురువారం కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఒక ప్రకటనలో తెలియచేశాయి. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల ప్రజల కోసం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రధానంగా విద్య, ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం, యువ సాధికారిత అంశాల ఆధారంగా కార్యక్రమం జరగనుందని వివరించారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే నవోదయం కార్యక్రమానికి విద్య, ఉద్యోగ, ఉపాధి, పరిశ్రమల శాఖ అధికారులు, బ్యాంకర్లు హాజరవుతారని వెల్లడించారు. ఆయా సామాజిక వర్గాల ప్రజలు పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కార్యాలయం సూచించింది.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 518.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎడమ కాలువకు 4,351 ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 5,701 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 809.00 అడుగుల వద్ద ఉంది.

కొల్లిపరలో 19.4 మి.మీ. వర్షం

కొరిటిపాడు(గుంటూరు) : గుంటూరు జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 19.4 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 0.8 మి.మీ వర్షం పడింది. సగటున 5.9 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా తెనాలి 12.4, పెదకాకాని 11.4, కాకుమాను 9.6, మేడికొండూరు 8.4, గుంటూరు పశ్చిమ 7.4, ఫిరంగిపురం 6.4, దుగ్గిరాల 5.8, పెదనందిపాడు 5.2, ప్రత్తిపాడు 4.8, తాడికొండ 3.4, గుంటూరు తూర్పు 3.2, చేబ్రోలు 2.2, మంగళగిరి 1.6, వట్టిచెరుకూరు 1.6, తాడేపల్లి 1.4, తుళ్ళూరు మండలంలో 1.2 మి.మీ చొప్పున వర్షం పడింది. జూలై మాసంలో 13వ తేదీ వరకు సాధారణ వర్షపాతం 166.3 మి.మీ వర్షపాతం కురవాల్సి ఉండగా, ఇప్పటి వరకు 240.9 మి.మీ వర్షపాతం నమోదైంది.

యార్డులో 40,535 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 36,610 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 40,535 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.25,500 వరకు పలికింది. ఏసీ కామన్ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.10,000 నుంచి 22,000 వరకు ధర లభించింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ. 10,000 నుంచి రూ. 24,200 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 12,085 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

అధికార వికేంద్రీకరణ ప్రభుత్వ లక్ష్యం

- గ్రామస్థాయిలో సచివాలయ, ఆర్బీకే వ్యవస్థలతో చేరువైన పాలన
- రైతుల ఆదాయం పెంచడమే సర్కారు లక్ష్యం
- కల్తీ విత్తనాల విక్రయాలపై ఉక్కుపాదం
- గుంటూరు చానల్ అభివృద్ధికి నిధుల కొరత లేదు
- ఈనెలాఖరుకు భూసేకరణ పూర్తవుతోంది
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు



డీఆర్సీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, చిత్రంలో ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, జేసీ రాజకుమారి, కమిషనర్ కీర్తి

సాక్షి ప్రతినిధి, గుంటూరు, గుంటూరు వెస్ట్: ఒకప్పుడు జిల్లా స్థాయిలో కేంద్రీకృతమైన అధికారం ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వలంటీర్ల వ్యవస్థల ద్వారా గ్రామస్థాయికి చేరిందని, జగనన్న సురక్ష పథకంతో గడప వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో గుంటూరు జిల్లా సమీక్ష సమావేశం జరిగింది. శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, కె.ఎస్.లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, కల్పలత రెడ్డి, ఎమ్మెల్యేలు ఆళ్ళ రామకృష్ణారెడ్డి(ఆర్కే), కిలారి వెంకట రోశయ్య, మహమ్మద్ ముస్తఫా, అన్నాబత్తుని శివకుమార్, డీసీసీబీ చైర్మన్ లాల్‌పురం రాము, జేసీ జి.రాజకుమారి, నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణ శర్మ పాల్గొన్నారు. వ్యవసాయం, ఉద్యాన శాఖ, ఏపీఎంఐపీ, నీటిపారుదల, హౌసింగ్, ఉపాధి హామీ పనులు, విద్య, వైద్య, జగనన్న భూ రక్ష, జగనన్న సురక్షపై విస్తృత స్థాయి చర్చ జరిగింది.

కల్తీకి పాల్పడేవారిని ఉపేక్షించేది లేదు

మంత్రి ధర్మాన మాట్లాడుతూ రైతుల ఆదాయం పెంచడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. జిల్లాలో కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు చలామణిలో ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. కల్తీలకు పాల్పడే వారు ఎంత పెద్దవారైనా ఉపేక్షించవద్దని అధికారులను ఆదేశించారు. గుంటూరు చానల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఈనెలాఖరుకు భూసేకరణ పూర్తవుతోందని, నిధుల కొరత లేదని పేర్కొన్నారు. కొందరు కావాలని అభివృద్ధిని అడ్డుకునేందుకు కోర్టు స్టేలు తెస్తున్నారని, రెవెన్యూ, లీగల్ బృందాలు పటిష్ట విధానాలతో పనిచేయాలని పేర్కొన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం సత్ఫలితాలిస్తోందని, 65 రకాల మందులను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ప్రాధాన్య భవనాలైన సచివాలయాలు, ఆర్బీకేలు, డిజిటల్ లైబ్రరీలు, విలేజ్ హెల్త్ సెంటర్ల నిర్మాణం వేగంగా జరుగుతుందని పేర్కొన్నారు.

త్వరలో ఎయిమ్స్‌కు నీళ్లు

కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గుంటూరు చానల్‌కు అడ్డంకులన్నీ దాదాపుగా తొలగిపోయాయన్నారు. మంగళగిరి ఎయిమ్స్‌కు నీటి సరఫరా కోసం ప్రభుత్వం రూ.7.7కోట్లు కేటాయించినట్టు వివరించారు. 70 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఫారెస్టు, నేషనల్ హైవేస్ నుంచి ఉన్న ఇబ్బందులూ తొలగాయని, వీలైనంత త్వరగా ఎయిమ్స్‌కు నీళ్లందిస్తామని వెల్లడించారు. ఈనెలాఖరుకు సీఆర్‌డీఏ పరిధిలో కేటాయించిన స్థలాల్లో శంకుస్థాపన నిర్వహిస్తామని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన భూరక్ష సర్వే వివరాలను వెల్లడించారు. శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నకిలీ విత్తనాల వల్ల పంటలు నష్టపోతే అందించే పరిహారం కోసం పంటల వారీగా వ్యవసాయ శాఖ అధికారులు నివేదిక అందించాలన్నారు.

దళారుల దోపిడీ



మిర్చి యార్డులో తేమశాతం ఎక్కువగా ఉందని కొందరు దళారులు రైతులను దోచుకుంటున్నారు. జిల్లాలో మంచినీటి కొరత అధికంగా ఉంది. గుంటూరులోనూ అదే పరిస్థితి. నీటి సమస్య పరిష్కారానికి 40 కిలో మీటర్ల దూరంలో ఉన్న కృష్ణా నది నుంచి పైపులైను ద్వారా నల్లపాడుకు తరలించి అక్కడ 110 ఎకరాల్లో ఉన్న చెరువులోకి నీటిని డంప్ చేయాలి. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా బుడంపాడు, తదితర ప్రాంతాలకు తాగు నీరు అందించవచ్చు. దీనికోసం రూ.100 నుంచి రూ. 120 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. దీనిపై సాంకేతిక బృందం దృష్టి సారించాలి.

– చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్సీ

మిర్చి రైతులకు నష్టపరిహారమేదీ?



తామర తెగులు ద్వారా నష్టపోయిన మిర్చి రైతులకు కృష్ణా జిల్లాలో ఎకరానికి రూ. 48 వేలు పరిహారం అందించారు. గుంటూరులో రైతులకు 28,590 ఎకరాల్లో నష్టం జరిగింది. వీరికి ఒక్క పైసా అందించలేదు. గుంటూరులోని బీసీ స్టడీ సర్కిల్‌కు ఎకరా స్థలం కేటాయించాలి. స్థలం ఉంటే రూ. 7 కోట్లు మంజూరు చేసేందుకు బీసీ సంక్షేమ శాఖ సిద్ధంగా ఉంది. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడంతో సరిపెట్టకుండా రుణాలూ అందించాలి. కొన్ని బ్యాంకులు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. గుంటూరు చానల్ అభివృద్ధిపై ప్రత్యేక బృందాన్ని నియమించి పనులు త్వరగా పూర్తి చేయించాలి.

– కె.ఎస్.లక్ష్మణరావు, ఎమ్మెల్సీ

సిబ్బందిని నియమించాలి



పిల్లుట్ల, మాచర్లలో ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది లేక ఇబ్బందిగా ఉంది. మంగళగిరిలో ప్రభుత్వ పాఠశాలల్లో 1300 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి కనీసం 34 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా, కేవలం 14 మంది ఉన్నారు. దీంతో డ్రాపౌట్స్ పెరిగే అవకాశం ఉంది. జిల్లాపరిషత్‌లో నాన్ టీచింగ్ స్టాఫ్ ఆవశ్యకత ఉంది. వీలైతే 98 డీఎస్సీలో ఎంపికైన వారిని నియమించాలని మనవి.

– కల్పలతారెడ్డి, ఎమ్మెల్సీ

తూటికాడను నిర్మూలించాలి



గుంటూరు చానల్‌తోపాటు బకింగ్‌హామ్ చానల్‌లో తూటికాడ పేరుకుంది. దీనిని శాశ్వతంగా తొలగించాలి. పీహెచ్‌సీల్లో సూపర్ స్పెషాలిటీ వైద్యుల అవసరం ఉంది. నియామక ప్రక్రియ చేపట్టాలి. చేనేత కార్మికుల వస్త్రాలు ఆప్కో ద్వారా కొనుగోలు చేయిస్తే బాగుంటుంది. ఈ దిశగా చర్యలు చేపట్టాలి. ఖరీఫ్‌లో రైతులతోపాటు కౌలు రైతులకు లక్ష్యాలకు మించి రుణాలు అందించేలా చూడాలి.

– మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్సీ

టిడ్కో భవనాలు పూర్తి చేయాలి



అడవితక్కెళ్లపాడులో టిడ్కో నిర్మాణాలు పూర్తి చేసి అర్హులకు అందించాలి. నా పరిధిలో కొన్ని ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. రెండు పాఠశాలలు పూర్తిగా మూతపడ్డాయి. వీటికి మరమ్మతులు చేయించాలి. రక్త పరీక్షలు, ఈసీజీ, స్కానింగ్‌కు ప్రైవేటు ఆసుపత్రులు దారుణంగా దోచుకుంటున్నాయి. వైద్య శాఖ ఆధ్వర్యంలో ధరల బోర్డును ఏర్పాటు చేయాలి.

– షేక్ ముస్తఫా, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే

నీటిని తోడేస్తున్నారు



చేబ్రోలు లిఫ్ట్ ఇరిగేషన్‌లో భూస్వాములు చెక్కలు అడ్డంగా పెట్టి నీటిని తోడేస్తున్నారు. ఎన్జీఆర్ఎస్ పనులు ఎక్కడ జరుగుతున్నాయో సమాచారం ఇవ్వాలి. నంబూరులో రెండు ప్రభుత్వ భవనాల నిర్మాణాన్ని స్వార్థంతో కొందరు కోర్టు స్టే ద్వారా ఆపేశారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న అన్న క్యాంటిన్లలో చేనేత వస్త్రాల విక్రయాలు జరిపితే బాగుంటుంది.

– కిలారి రోశయ్య, పొన్నూరు ఎమ్మెల్యే

గుర్రపు డెక్క తొలగించాలి



సేద్యానికి సంబంధించి తీసుకున్న చర్యలు, వివరాలు మాకు పంపండి. పసుపును మార్క్‌ఫెడ్ ద్వారా కొనాలి. తైవాన్ స్ప్రేయర్ల కొరత ఉంది. బకింగ్‌హామ్, గుంటూరు చానల్ కాలువల్లో బెడ్స్, షట్టర్స్‌కు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలి. గుర్రపుడెక్క తొలగించాలి. గుంటూరు చానల్ మురుగు కాలువగా మారింది. శుభ్రం చేయాలి.

– ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), మంగళగిరి ఎమ్మెల్యే

డ్రాపౌట్స్‌పై దృష్టి పెట్టాలి



నందివెలుగులో గత ఏడాదితో పోల్చుకుంటే ఇప్పుడు విద్యార్థుల ప్రవేశ సంఖ్య బాగా తగ్గింది. కారణాలు ఏంటి? డ్రాపౌట్స్‌పై అధికారులు తీసుకుంటున్న చర్యలు శాసన సభ్యులకు కూడా వివరించాలి. కల్తీ విత్తనాలు అరికట్టడంలో విఫలమైతే రైతులు దారుణంగా నష్టపోతారు. దీనిని గుర్తించాలి. అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలి.

– అన్నాబత్తుని శివకుమార్, తెనాలి ఎమ్మెల్యే

నభూతో న భవిష్యతి



భూరక్ష కలికితు'రాయి': సర్వే అనంతరం హద్దురాయి పాతుతున్న సిబ్బంది

శరవేగంగా 'భూ రక్ష' రీ సర్వే

- ఇప్పటికే 58 గ్రామాల్లో సమగ్రంగా పూర్తి
- మొత్తం 173 గ్రామాల్లో పథకం అమలు
- ఇప్పటికే 134 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి
- రెండో దశలో 53 గ్రామాల్లో మ్యాపింగ్ పూర్తి
- మొత్తం 5,95,913 ఎకరాల్లో కొలతలు



'సర్వే' రైతుజనా సుఖీభవ: సర్వే చేస్తున్న దృశ్యం

రైతులు సహకరించాలి



జిల్లాలో వైఎస్సార్-జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా రీ-సర్వే వేగంగా జరుగుతోంది. ఈ నెలాఖరుకు మొత్తం 173 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేస్తాం. గ్రామాల్లోకి అధికారులు వచ్చినప్పుడు రైతులు అందుబాటులో ఉండి సహకరిస్తే పని త్వరగా పూర్తవుతుంది.

– జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్

ఉపయోగాలివీ..

- సర్వే అనంతరం సంబంధిత భూమి, స్థలం యజమానికి ప్రింటెడ్ పాస్‌బుక్ ఉచితంగా ఇస్తారు.
- భూహద్దు, దస్తావేజు సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయి. చట్టబద్ధత వస్తుంది.
- గ్రామాల్లో సరిహద్దు వివాదాలకు పరిష్కారం దొరుకుతుంది.
- రీ సర్వే తర్వాత ఇచ్చే పట్టాలు, పాస్‌పుస్తకాలతో రుణాలు పొందవచ్చు.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాలో వైఎస్సార్-జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ద్వారా రీ సర్వే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మొదటి దశలో ఐదు గ్రామాల్లో ఈ రీసర్వే పూర్తి చేయగా, రెండో దశలో 168 గ్రామాల్లో సర్వే చేస్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి జిల్లా మొత్తం సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 53 గ్రామాల్లో మ్యాపింగ్ పూర్తయింది.

115 ఏళ్ల తర్వాత

ఎప్పుడో 1905లో బ్రిటిష్ హయాంలో భూముల సర్వే చేపట్టారు. ఆ తర్వాత భూముల సర్వే జరగలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక శాశ్వత భూహక్కు, భూరక్ష పథకాన్ని చేపట్టి రీసర్వే పనులు చేపట్టారు. గుంటూరు జిల్లాలో 2020 డిసెంబర్‌లో రీసర్వే ప్రారంభమైంది. ఎక్కడా ఏ ఒక్క రైతు, నిజమైన హక్కుదారుకు అన్యాయం జరగకుండా సర్వేను అధికారులు పకడ్బందీగా చేపడుతున్నారు. ఎక్కువ మంది కౌలు రైతులు ఉండటం, అసలు పట్టాదారులు అందుబాటులో లేకపోవడం వల్ల సర్వేలో కొంత జాప్యం జరుగుతోంది. అయినా సాధ్యమైనంత త్వరగా ఈ రీసర్వేను పూర్తిచేసేలా జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ప్రతి అంగుళం భూమినీ మ్యాపింగ్‌లోకి తీసుకు రావడంతోపాటు భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా సర్వే సాగుతోంది.

ఐదు గ్రామాల్లో విజయవంతంగా..

తొలుత పైలెట్ ప్రాజెక్ట్‌గా దుగ్గిరాల మండలంలోని దేవరాపల్లి అగ్రహారం, ప్రత్తిపాడు మండలంలోని కొండజాగర్లమూడి, వేమూరు మండలంలోని పులిచింతల పాలెం, యడ్లపాడు మండలంలోని మద్రిపాలెం, దాచేపల్లి మండలంలోని అలుగుమల్లిపాడులను రీసర్వేకు ఎంపిక చేశారు. ఈ గ్రామాల్లో సర్వే ప్రక్రియ విజయవంతంగా ముగిసింది. హక్కుదారులకు పత్రాల అందజేత కూడా పూర్తయింది.

134 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి

గుంటూరు జిల్లాలో మొత్తం 223 గ్రామాలు ఉండగా గుంటూరు డివిజన్‌లో 119, తెనాలి డివిజన్‌లో 104 గ్రామాలు ఉన్నాయి. సీఆర్‌డీఏ పరిధిలోని 20 గ్రామాలతోపాటు, మంగళగిరి- తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నాలుగు గ్రామాలు, 26 అర్బన్ గ్రామాల్లో ప్రస్తుతం సర్వే నిర్వహించడం లేదు. మిగిలిన 173 గ్రామాల్లో రీసర్వే చేపట్టారు. మొదటిదశలో ఐదు పైలెట్ గ్రామాల్లో సర్వే పూర్తయింది. 2,586 ఎకరాల్లో సర్వే పూర్తి చేసి 2,056 మంది రైతులకు భూహక్కు పత్రాలను అందజేశారు. రెండో దశలో 168 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ జరుగుతోంది. ఇప్పటి వరకు 134 గ్రామాల్లో డ్రోన్‌ను తిప్పి ఏరియల్ వ్యూ మ్యాపింగ్ పూర్తి చేశారు. మొత్తం 5,95,913 ఎకరాల్లో కొలతలు పూర్తయ్యాయి.

53 గ్రామాల్లో ఓఆర్ఐ పూర్తి

53 గ్రామాలకు సంబంధించి ఓఆర్ఐ(ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్)ను జారీ చేశారు. మేడికొండూరులో 11 గ్రామాలు, వట్టిచెరుకూరులో 13 గ్రామాలు, పెదనందిపాడులో 12 గ్రామాలు, ప్రత్తిపాడులో ఏడు గ్రామాలు, తెనాలిలో ఆరు గ్రామాలు, దుగ్గిరాలలో నాలుగు గ్రామాల్లో ఈ ఓఆర్ఐ ప్రక్రియ పూర్తయింది. మొత్తం 1,30,283 ఎకరాల్లో ఓఆర్ఐ పూర్తికాగా, 19,418 ఎకరాలకు రీసర్వే పూర్తయింది. వీటిని క్షేత్రస్థాయిలో భూమితో పోల్చి నిజ నిర్ధారణ(గ్రౌండ్ ట్రూతింగ్) చేసి 13 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశారు.

బియ్యం, పప్పుల ధరలు తగ్గించాలి

వ్యాపారులకు జేసీ రాజకుమారి ఆదేశం

గుంటూరు వెస్ట్: నిత్యావసరాల ధరలు తగ్గించాలని జాయింట్ కలెక్టర్ రాజకుమారి వ్యాపారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో మిల్లర్లు, వ్యాపారులతో ఆమె సమావేశమయ్యారు. ప్రభుత్వం నిర్దేశించిన తాజా ధరలను వివరించారు. ఈ మేరకు అమ్మకాలు చేపట్టాలని సూచించారు. ఆదేశాలు బేఖాతరు చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైతుబజారుల్లో బీపీటీ బియ్యాన్ని అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. వ్యాపారులు కొంత సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని జేసీ కోరారు. సమావేశంలో డీఎస్‌ఓ పద్మ, పౌరసరఫరాల సంస్థ డీఎం లక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు (కిలోకు రూపాయల్లో)

నిత్యావసరం	ఇప్పటివరకు ధర	తాజాగా ప్రభుత్వం నిర్దేశించిన ధర
స్టీమ్ బియ్యం	50	44
రా బియ్యం	56	48
మినప గుండ్లు	115	101

సీఎం వైఎస్ జగన్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్సీ తలశిల రఘురామ్

మంగళగిరి: మండలంలోని కృష్ణాయపాలెంలో గురువారం సీఎం కార్యక్రమాల కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ పర్యటించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణాయపాలెంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో త్వరలో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, నార్త్‌సబ్ డివిజన్ డీఎస్పీ జె.రాంబాబు, సీఐ అంకమ్మరావుతోపాటు పలువురు పోలీస్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు సిద్ధం కావాలి

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్ : జగనన్న లే -అవుట్లలో ఇంకా ప్రారంభం కాని ఇళ్ల నిర్మాణాలను చేపట్టేందుకు ఏజెన్సీలు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలోని 25 లే-అవుట్లలోని 47,017 మంది లబ్ధిదారులకు గృహాలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఈనెల 24న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భూమి పూజతో నిర్మాణ పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. సంబంధిత లబ్ధిదారులకు గృహ మంజూరు పత్రాలు పంపిణీ కూడా అదే రోజు సీఎం చేతుల మీదుగా అందిస్తారన్నారు. దీనికి సంబంధించి అధికారులు, గృహనిర్మాణ ఏజెన్సీలు అందరూ పూర్తి సన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. పేదవాడికి నివాసయోగ్యం కల్పించే గొప్ప సంకల్పంతో ప్రభుత్వం తలపెట్టిన ఈ మహాయజ్ఞాన్ని అత్యంత బాధ్యతతో నిర్వహించాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, సెకండ్ డెప్యూటీ కలెక్టర్ వెంకటశివరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు

- పోక్సో, హత్యకేసుల్లో నిందితులపై రౌడీషీట్లు
- నేర సమీక్షలో ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్



మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్‌హాఫీజ్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): పోక్సో, హత్య కేసుల్లోని నిందితులపై రౌడీషీట్లు తెరవాలని ఎస్పీ కె.ఆరిఫ్‌హాఫీజ్ పోలీసు సిబ్బందికి సూచించారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాలులో గురువారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. దీర్ఘకాల పెండింగ్ కేసులపై ఆరాతీసి, త్వరగా ఛేదించాలని ఆదేశించారు. గతంలో ఐజీ నిర్వహించిన సమావేశంలో చర్చించిన కేసులపైనా విచారణ త్వరగా చేపట్టాలని పేర్కొన్నారు. ఎస్పీ ఆరిఫ్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిరంతరం నిఘా ఉంచాలని చెప్పారు. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యాసంస్థల వద్ద దిశ వాహనాలతో గస్తీ నిర్వహించాలని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే సుమారు 5,908 మందిపై 5,626 కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. పోక్సో, మహిళలపై జరిగే నేరాలతోపాటు రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. అదృశ్య కేసులను వేగంగా ఛేదించాలని సూచించారు. రోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. గంజాయి రహిత జిల్లా కోసం అందరూ కృషి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ కేసులను త్వరగా ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బంది, వార్డు మహిళా పోలీసులను ఎస్పీ అభినందించి, ప్రశంస పత్రాలు అందించారు. సమావేశంలో ఏఎస్పీలు ఎస్.షెల్కే (గుంటూరు తూర్పు), కె.సుప్రజ (పరిపాలన), ఎ.శ్రీనివాసరావు (క్రైం), డీఎస్ మహేష్ (ఎస్ఈబీ), కె.శ్రీనివాసరావు (ఎల్అండ్ఓ), డీఎస్పీలు సుభాష్ (ఎస్‌బీ), పోతురాజు (తుళ్ళూరు), ఉమామహేశ్వరరెడ్డి (పశ్చిమ), రాంబాబు (ఉత్తర), జనార్దన్‌రావు (తెనాలి), బాల సుందరరావు (ట్రాఫిక్), విజయశేఖర్ (ఎస్‌సి, ఎస్‌టి), శ్రీనివాసరావు (డిసిఆర్‌బి), ప్రకాష్‌బాబు (సీసీఎస్), చంద్రశేఖర్‌రావు (ఏఆర్), సెబ్ ఏఎస్ మణికంఠ, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.

16న గ్రూప్‌-2 ఉచిత అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్‌: ఏపీపీఎస్సీ త్వరలో నిర్వహించనున్న గ్రూప్‌–2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఈనెల 16న ఉచిత అవగాహన సదస్సుతో పాటు ఆన్‌లైన్‌, ఆఫ్‌లైన్‌లో రాష్ట్రస్థాయి మాక్‌ టెస్ట్‌ నిర్వహిస్తున్నట్లు అమిగోస్‌ 21వ సెంచరీ ఐఏఎస్‌ అకాడమీ అకడమిక్‌ డైరెక్టర్‌ జనార్దన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీపీఎస్సీ నూతన సిలబస్‌పై వర్క్‌షాప్‌, ప్రిలిమ్స్‌ ఫ్రీ మాక్‌టెస్ట్‌ను ఆదివారం ఉదయం 9.00 గంటలకు హైదరాబాద్‌ అశోక్‌ నగర్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రూప్‌–2 నూతన సిలబస్‌, ప్రిపరేషన్‌ స్ట్రాటజీ, నోట్సు మేకింగ్‌, సమయపాలన తదితర అంశాలపై సీనియర్‌ అధ్యాపకులచే సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు రాష్ట్రస్థాయి మాక్‌ పరీక్షను ఆన్‌లైన్‌, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 040–35052121, 9000230734 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. పూర్తి వివరాలను 9133237733 నంబరుకు వాట్సాప్‌ చేయాలని తెలిపారు.

ముఖ్యమంత్రి నిర్ణయం చారిత్రాత్మకం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్‌



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డొక్కా

పట్నంబజారు: సంక్షేమం ప్రతి ఒక్కరికీ అందేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు చారిత్రాత్మకమని వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్‌ చెప్పారు. గురువారం లాడ్జిసెంటర్‌లోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బి.ఆర్‌. అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు మేలు జరిగేలా రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ సీఎం వై.ఎస్‌.జగన్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాణిక్య వరప్రసాద్‌ మాట్లాడుతూ దళిత, పేద వర్గాలకు మేలు జరిగేలా 54 వేల ఎకరాల అసైన్డ్‌ భూములు, తొమ్మిది వేల ఎకరాలు పంపిణీ చేసేందుకు నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకమన్నారు. ఆలయ అర్చకులకు సంబంధించి రూ.10 వేలు జీత భత్యాలు అందజేయడంతోపాటు, వయో పరిమితిని పెంచడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్‌ షజిల, వైఎస్సార్‌సీపీ నేతలు నిమ్మకాయల రాజనారాయణ యాదవ్‌, షేక్‌ నూరిఫాతిమా, సీడీ భగవాన్‌, ఆవుల సుందరరెడ్డి, గనిక ఝాన్సి, ముంతాజ్‌, పెరికల కృష్ణమోహన్‌, సింగు నరసింహారావు, బందా రవీంద్రనాథ్‌, బత్తుల దేవానంద్‌ పాల్గొన్నారు.

జగనన్న నిర్ణయం హర్షణీయం

ఎంపీ నందిగం సురేష్‌



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీ నందిగం

ఉద్దండరాయునిపాలెం (తాడికొండ): అసైన్డ్‌ రైతుల విషయంలో సీఎం జగన్‌ మోహన్‌ రెడ్డి కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం హర్షణీయమని బాపట్ల ఎంపీ, రాష్ట్ర ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు నందిగం సురేష్‌ అన్నారు. గురువారం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో రాజధాని అసైన్డ్‌ రైతులతో కలిసి ఆయన క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా అసైన్డ్‌ భూముల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, కానీ సీఎంగా వైఎస్‌ జగన్‌ మోహన్‌ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత పేదల కోసం అహర్నిశలు పరితపిస్తూ వాటికి చట్టబద్ధత కల్పించి రిజిస్ట్రేషన్‌ హక్కులు కల్పించడం చరిత్ర అన్నారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు అసైన్డ్‌ రైతులకో ప్యాకేజీ, పట్టా భూమికో ప్యాకేజీ వచ్చేలా వ్యత్యాసం చూపించి తన బినామీలను పెట్టి అన్యాక్రాంతం చేశాడన్నారు. గతంలో అసైన్డ్‌ భూములు అమ్మకానికి అవకాశం లేక తప్పనిసరి అయితే తక్కువ ధరలకు అమ్ముకొని పేదలు నష్టపోయారన్నారు. నేడు సీఎం జగన్‌మోహన్‌ రెడ్డి తీసుకున్న నిర్ణయంతో అసైన్డ్‌ భూములకు సాధారణ భూములకు కల్పించినట్లు రిజిస్ట్రేషన్‌లు జరిగి ధరలు పెరగనుండటం పేదల ఆర్థిక ఎదుగుదలకు బాటలు వేసిందనడంలో సందేహం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్సీపీ నాయకులు, అసైన్డ్‌ రైతులు పాల్గొన్నారు.

హర్షం వ్యక్తం చేసిన అర్చకుల సంఘం

- జీతభత్యాల పెంపుపై సర్వత్రా హర్షం
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చక సమాఖ్య

పట్నంబజారు: అర్చక లోకం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డిని నిండు మనస్సుతో ఆశీర్వదించారు. సర్వేజనాః సుఖినోభవంతు అని స్వచ్ఛమైన మనస్సుతో ప్రతి ఒక్కరిని ఆశీర్వదించే అర్చకులకు సీఎం వై.ఎస్‌.జగన్‌ రూ.10 వేలు జీత భత్యాలు పెంచుతూ కేబినెట్‌ నిర్ణయం నేపథ్యంలో గురువారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు సెంటర్‌లో సీఎం జగన్‌ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈమేరకు ఇకపై అర్చకులకు అసలు రిటైర్మెంట్‌ లేకుండా చట్ట సవరణ చేసేందుకు కేబినెట్‌ ఆమోద ముద్ర వేసింది. దీనికి యావత్‌ అర్చకలోకం సంతోషాన్ని వ్యక్తం చేసింది. గుంటూరు అర్బన్‌ బ్యాంకు డైరెక్టర్‌ బందా రవీంద్రనాథ్‌, కార్పొరేటర్‌ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) మాట్లాడుతూ సీఎం వై.ఎస్‌.జగన్‌ మోహన్‌రెడ్డి బ్రాహ్మణ పక్షపాతి, బ్రాహ్మణులకు ఆయన తగిన గుర్తింపు, గౌరవం, సముచిత స్థానం కల్పించడమే అందుకు నిదర్శనమన్నారు. అన్ని రంగాలలో తమకు అగ్రతాంబూలం ఇచ్చి గత పాలకులెవరూ చేయని విధంగా బలోపేతం చేస్తున్నారన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.300 కోట్లు కేటాయించి పూర్తిస్థాయిలో బలోపేతం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పరుచూరి శ్రీనివాసచార్యులు, పరుచూరి కృష్ణమాచార్యులు, కంతేటి లక్ష్మీనారాయణ శర్మ, చెన్నాభట్ల కాశ్యపశర్మ, గురుదేవ్‌, కంతేటి శ్యామ్‌, నోరి పార్థసారధి, అన్నం రాజు సాయిరాం పాల్గొన్నారు.

ఘనంగా తాడిపర్తి చిత్రపటం ఆవిష్కరణ



తాడిపర్తి చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ సోమయాజులు

గుంటూరు లీగల్‌: గుంటూరు బార్‌ అసోసియేషన్‌లో సీనియర్‌ న్యాయవాది, దివంగత తాడిపర్తి రామమోహన రావు చిత్రపటం ఆవిష్కరణ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ డీవీఎస్‌ఎస్‌ సోమయాజులు చిత్రపటాన్ని ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్‌.బి.జి. పార్థసారథి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా జడ్జీలు, సబ్‌ జడ్జీలు, జూనియర్‌ సివిల్‌ జడ్జీలు, ప్రెసిడెంట్‌ కె.వి.కె.సురేష్‌, వైస్‌ ప్రెసిడెంట్‌ దాసరి ఉమామహేశ్వరరావు, జనరల్‌ సెక్రటరీ నాగ వంశీకృష్ణ, ట్రెజరర్‌ విజయ రాజ కుమార్‌, జీబీఏ మాజీ ప్రెసిడెంట్‌ శాంతకుమార్‌, సీనియర్‌ న్యాయవాది వైకే, ఏపీపీలు, గుంటూరు బార్‌ అసోసియేషన్‌ కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌ నేరాలపై అవగాహన అవసరం

ఎస్పీ కె.ఆరిఫ్‌ హఫీజ్‌

నగరంపాలెం: సైబర్‌ నేరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ కె.ఆరిఫ్‌ హఫీజ్‌ సూచించారు. ఇటీవల కొందరు బాధితులు వివిధ రూపేణ నగదు పోగొట్టుకున్నారు. దీనిపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో వివిధ కేసుల్లో దర్యాప్తు జరిపి, రూ.6.37 లక్షలను బాధితులకు అప్పగించడం జరిగింది. దీంతో పలువురు బాధితులు గురువారం జిల్లా పోలీస్‌ కార్యాలయ ఆవరణలో ఎస్పీ కె.ఆరిఫ్‌ హఫీజ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. పోగొట్టుకున్న డబ్బులు వచ్చే పరిస్థితులు ఉండవని నిరాశపడ్డామని, అయితే తమ డబ్బులు తిరిగి అప్పగించడం ఆనందంగా ఉందని బాధితులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు అందరూ తమ వ్యక్తిగత వివరాలను ఇతరులకు తెలియపరచవద్దన్నారు. అందరూ ఝ్బుచీజ్బిట అనే యాప్‌ డౌన్‌లోడ్‌ చేసుకుని, తమ బయోమెట్రిక్‌ను తప్పనిసరిగా లాక్‌ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ, ఐటీకోర్‌ ఎస్‌ఐ శ్రీనాథ్‌ పాల్గొన్నారు.

పోయిన సెల్‌ఫోన్లు సైతం...

ఇప్పటి వరకు వందలాది మంది బాధితులకు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను అప్పగించినట్లు జిల్లా ఎస్పీ కె. ఆరిఫ్‌ హఫీజ్‌ అన్నారు. వివిధ చోట్ల మొబైల్‌ ఫోన్లను పోగొట్టుకున్న సుమారు వంద మంది బాధితులకు వారి సెల్‌ఫోన్లను గురువారం జిల్లా పోలీస్‌ కార్యాలయ ఆవరణలో అందించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రారంభించిన సెల్‌ఫోన్‌ వాట్సాప్‌ నంబర్‌కు బాధితుల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు.




మొబైల్‌ఫోన్లు అందుకున్న వారితో ఎస్పీ ఆరిఫ్‌ హఫీజ్‌

ఇతర జిల్లాలోని బాధితుల నుంచి కూడా వాట్సాప్‌ నంబర్‌కు మెసేజ్‌లు వస్తున్నాయని చెప్పారు. వాట్సాప్‌ నంబర్‌ 8688831574కు మెసేజ్‌ వచ్చిన వెంటనే టీఏడబ్ల్యూ (ఐటీ కోర్‌) ప్రత్యేక బృందం వివరాలు సేకరిస్తుందన్నారు. సత్వరమే ఫోన్లను గుర్తించి బాధితులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సుమారు వంద మంది బాధితులకు పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను అప్పగించినట్లు చెప్పారు.

చనిపోయిన మిర్చి మొక్కలు

- పాత కక్షల నేపథ్యంలో గడ్డి మందు చల్లిన వైనం
- పోలీసులకు ఫిర్యాదు

వెల్దుర్తి: పాతకక్షల నేపథ్యంలో మండలంలోని ఉప్పలపాడు గ్రామ సమీపంలో ఉన్న శ్రీ బాలాజీ నర్సరీలో మిర్చి మొక్కలకు గడ్డి మందు చల్లగా చనిపోయాయి. నర్సరీ యజమాని మందా సీతారామిరెడ్డి మాట్లాడుతూ గతంలో రెంటాల గ్రామానికి చెందిన వెన్నా శ్రీనివాసరెడ్డితో కలిసి పదేళ్ల నర్సరీని నిర్వహించామని, మనస్పర్థలు రావటంతో గతేడాది విడిపోయామని తెలిపారు. ఆ విషయాన్ని మనసులో పెట్టుకొన్న శ్రీనివాసరెడ్డి నర్సరీలోని మిర్చి మొక్కలకు మూడు గేట్‌ వాల్స్‌ ద్వారా వచ్చే నీటిలో గడ్డి మందు కలిపినట్లు తెలిపారు. దీంతో ట్రేలలో ఉన్న మిర్చి మొక్కలు చనిపోయాయన్నారు. ఈ మిర్చి మొక్కల విలువ రూ.కోటి ఉంటుందన్నారు. సంబంధిత శాఖాధికారులు విచారణ జరిపి నాకు న్యాయం చేయాలన్నారు. ఈ విషయంపై వెల్దుర్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు.



విద్యతోనే ఉన్నత స్థాయికి చేరువయ్యేది

- క్రికెటర్‌ అంబటి రాయుడు
- ముట్లూరు సెయింట్‌ గ్జేవియర్స్‌ హైస్కూలుకు రూ. 5 లక్షల విరాళం



వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): విద్యతోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని క్రికెటర్‌ అంబటి రాయుడు అన్నారు. వట్టిచెరుకూరు మండలం ముట్లూరులోని సెయింట్‌ గ్జేవియర్స్‌ హైస్కూలులో గురువారం క్రికెటర్‌ అంబటి రాయుడు పర్యటించారు. కొద్ది రోజుల కిందట ఇదే స్కూలును రాయుడు సందర్శించిన సమయంలో పాఠశాల పూర్వ వైభవానికి కృషిచేసి, వసతులను మెరుగుపరిచేందుకు తోడ్పాటునందించాలని చర్చి ఫాదర్‌ దిలీప్‌కుమార్‌, ప్రధానోపాధ్యాయురాలు జ్యోస్నిలాలు కోరారు. సానుకూలంగా స్పందించిన రాయుడు పాఠశాలకు తనవంతు సాయం అందించారు. స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మౌలిక వసతుల కల్పన నిమిత్తం రూ. 5 లక్షల రూపాయల చెక్కును ఫాదర్‌ దిలీప్‌కుమార్‌, ప్రధానోపాధ్యాయురాలు జ్యోస్నిలాలకు అందజేశారు. ఈ సందర్భంగా అంబటి రాయుడు మాట్లాడుతూ ఇంతటితోనే కాదని, పాఠశాలను మరింతగా అభివృద్ధి చేసి, పునర్‌వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పెయింట్లు, మరమ్మతులకు కూడా సహకరిస్తానని చెప్పారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ యెనుముల రాంబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేటఈస్ట్‌: పల్నాడు జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు–2023కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్‌ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు 10 సంవత్సరాలు సర్వీస్‌ పూర్తిచేసి, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హత కలిగి ఉన్న వారు దరఖాస్తులను ఆన్‌లైన్‌ ద్వారా పంపాలని కోరారు. నేరుగా దరఖాస్తులు స్వీకరించబడవని స్పష్టం చేశారు.

ప్ర'కృతి నీవు..ధృతి నీవు'

- ఇది రాజేంద్రుడి నినాదం
- పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి
- సాహితీ సేవలోనూ ముందు
- బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు



అవార్డు అందుకుంటున్న రాజేంద్ర ప్రసాద్‌ (ఫైల్‌)

గుంటూరు డెస్క్‌ : మనిషి ప్రకృతితో మమేకమై జీవించాలి తప్ప నేను వేరు.. సకల చరాచర సృష్టి వేరు అంటూ తన స్వార్థం కోసం సహజ వనరులను విధ్వంసం చేస్తే పర్యావరణానికి పెనుముప్పు పొంచి ఉన్నట్టే అంటారు గుంటూరుకు చెందిన ప్రకృతి ప్రేమికుడు డాక్టర్‌ తూములూరి రాజేంద్రప్రసాద్‌ ఈ భూమ్మీద సమస్త జీవరాశులకు ఏ కాలంలో ఎటువంటి ఆహారాన్ని ఇవ్వాలో, ఎలాంటి పండ్లను ఇవ్వాలో ప్రకృతికి తెలుసని, మనిషి ప్రకృతిపై పైచేయి సాధించాలనే తాపత్రయం మాని సృష్టి ధర్మాన్ని అనుసరించి అణకువగా నడుచుకుంటే భవిష్యత్‌ తరాలకు కూడా పచ్చని పర్యావరణాన్ని మనం కానుకగా ఇచ్చిన వారమవుతామని అంటారాయన.



డాక్టర్‌ తూములూరి రాజేంద్రప్రసాద్‌

బహుముఖ ప్రజ్ఞాశాలి

గుంటూరు జిల్లా పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరులో 1962లో జన్మించిన తూములూరి రాజేంద్రప్రసాద్‌ హైస్కూలు విద్య వరకు అక్కడే పూర్తిచేశారు. కళాశాల విద్యను పెదనందిపాడులో, ఎంఏ సోషియాలజీ నాగార్జున యూనివర్సిటీలో చేశారు. అనంతరం మధురై కామరాజ్‌ యూనివర్సిటీ నుంచి ఎంఏ జర్నలిజం చేశారు. ఆయన తండ్రి తూములూరి నారాయణ దాసు ఆ రోజుల్లోనే ఎంఏ, బీఈడీ చేశారు. ఏసీ కళాశాలలో ఎన్‌.టి.రామారావు, కొండవీటి వెంకటకవి, కొంగర జగ్గయ్యల సహచరులు. తండ్రి స్ఫూర్తితో చిన్నతనం నుంచి విద్యపై బాగా మక్కువ పెంచుకున్నారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో తెలుగు, ఇంగ్లిష్‌, హిందీలలో టైప్‌ లోయర్‌, హయ్యర్‌ పూర్తిచేశారు. హిందీలో భాషా ప్రవీణ కూడా చేశారు. వ్యవసాయ శాఖలనైనా ఉద్యోగం రాక పోతుందా అని అగ్రికల్చర్‌ డిప్లొమా కూడా చేశారు. ఎలాగైతే 1984లో టెలిగ్రాఫ్‌ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం వచ్చింది. హైదరాబాద్‌లో ఒక ఏడాది ఉద్యోగం చేశాక, కృష్ణా జిల్లాలో టీచరు ఉద్యోగం వస్తే ఒక ఏడాదిపాటు చేశారు. ఇంతలో మరో ఏడాదికి ఆంధ్రాబ్యాంకులో ఉద్యోగం వచ్చింది. బ్యాంకు ఉద్యోగం భేష్‌ అనుకుని ఆయన అందులోనే కొనసాగారు. 33 ఏళ్లపాటు పనిచేసి 2019లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. అయితే ఆయన బ్యాంకు ఉద్యోగం చేస్తూనే 1997లో విజయవాడ ఆకాశవాణిలో న్యూస్‌రీడర్‌గా ఎంపికయ్యారు. దాని కోసం బ్యాంకు ఉద్యోగాన్ని కూడా విజయవాడకు బదిలీ చేయించుకుని రెండింటినీ సమన్వయం చేసుకుంటూ విజయవంతంగా నిర్వహించారు. ఇవన్నీ చేస్తూనే దూరదర్శన్‌ సప్తగిరి చానల్‌కు స్క్రిప్ట్‌ రైటర్‌గా పనిచేశారు.

సాహితీ సేవ

డాక్టర్‌ భోగరాజు పట్టాభి సీతారామయ్య పేరుతో 2010లో పట్టాభి కళాపీఠం స్థాపించి కవి సమ్మేళనాలు, వివిధ సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వివిధ రంగాల్లో లబ్ధప్రతిష్టులైన తొమ్మిది మందికి నవరత్నాలు పేరుతో పట్టాభి అవార్డులు ఇచ్చి సత్కరిస్తున్నారు. శతకవి సమ్మేళనం నిర్వహించి యువ కవులను ప్రోత్సహిస్తున్నారు.

ప్రపంచ రికార్డులు

కవిగా, రచయితగా, పర్యావరణ వేత్తగా, పుస్తక సమీక్షకుడిగా వక్తగా, న్యూస్‌రీడర్‌గా, టీవీ యాంకర్‌గా బహుముఖ ప్రజ్ఞ కనపరుస్తున్న రాజేంద్రప్రసాద్‌ పలు ప్రపంచ రికార్డులనూ అందుకున్నారు. 2012లో చిత్ర మాసపత్రికలో ఒకే సంచికలో ఈయన రాసిన 12 పుస్తక సమీక్షలు ప్రచురితమయ్యాయి. ఇది ముద్రణా రంగంలో ఒక ప్రపంచ రికార్డుగా నమోదయింది. దీనికిగాను ఆయన ఎవరెస్ట్‌ వరల్డ్‌ రికార్డు, ఎసిస్ట్‌ వరల్డ్‌ రికార్డు, ఇండియా బుక్‌ ఆఫ్‌ రికార్డ్స్‌, బుక్‌ ఆఫ్‌ స్టేట్‌ రికార్డ్స్‌, వరల్డ్‌ అమేజింగ్‌ రికార్డు, మిరాకిల్‌ వరల్డ్‌ రికార్డులను అందుకున్నారు.

పర్యావరణంపై 10 పుస్తకాల రచన

2004లో విశాలాంధ్ర ఆదివారం సంచిక కోసం వారం వారం పర్యావరణంపై వ్యాసాలు రాయడం ప్రారంభించిన రాజేంద్రప్రసాద్‌ అప్పటి నుంచి గత 20 ఏళ్లుగా పర్యావరణంపై 10 పుస్తకాలు రచించారు. కేవలం పుస్తకాలు రాసి ఊరుకోలేదాయన. పర్యావరణంపై యువతను జాగృతం చేయడం కోసం కళాశాలలు, పాఠశాలలకు వెళ్లి పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. అంతేకాదు పలు విద్యా సంస్థలకు వెళ్లినపుడు అక్కడ స్వయంగా మొక్కలు నాటి విద్యార్థులను చైతన్యపరుస్తున్నారు.

రాజేంద్రప్రసాద్‌ పది పుస్తకాలు ఇవే

- పర్యావరణం–మానవుడు
- పర్యావరణాన్ని కాపాడుకుందాం
- మనం–పర్యావరణం
- ప్రకృతి–పర్యావరణ పరిరక్షణ
- పర్యావరణ శాస్త్రం
- పర్యావరణ విజ్ఞాన శాస్త్రం
- పర్యావరణ అధ్యయన శాస్త్రం
- ప్రకృతి–పర్యావరణం
- జీవ వైవిధ్యం–మానవాళి మనుగడ
- ప్రకృతిని పరిరక్షించుకుందాం



బిరుదులు, అవార్డులు

1995లో బెస్ట్‌ యంగ్‌ రైటర్‌, 2006లో విశ్వదాత, 2009లో పర్యావరణ రత్న, 2013లో సంఘమిత్ర, 2012లో ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం తరపున జీవ వైవిధ్య రక్షక్‌ బిరుదులు పొందారు. ఇటీవల పర్యావరణంలో ఆయన చేస్తున్న కృషికి ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వం ఈ ఏడాది బయో డైవర్సిటీ కన్జర్వేటర్‌ అవార్డు ప్రదానం చేసింది. దీనిని ఆయన గత నెలలో తిరుపతిలో బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్‌ డాక్టర్‌ బీఎంకే రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గుంటూరులో ఆయన మిత్రులు ఈ నెల 16వ తేదీ ఆదివారం ఆయనకు అభినందన సభ, సత్కారం నిర్వహించనున్నారు.

సాక్షి
ఫ్యామిలీ
గుంటూరు
శుక్రవారం ॥ 14-7-2023

● యంగ్ టాలెంట్

ఆత్మవిశ్వాసం ఉండగా... అధైర్యం ఎందుకు!

ఆరోగ్యం నుంచి బాలీవుడ్ వరకు రకరకాల వీడియోలు చేస్తూ డిజిటల్ క్రియేటర్‌గా దూసుకుపోతుంది దిల్లీకి చెందిన సెజల్ కుమార్. 'ఫ్యాషన్-పాట-డ్యాన్స్' ఆమె బలం. మన దేశంలోని టాప్ యూట్యూబ్ స్టార్‌లలో సెజల్ ఒకరు. దిల్లీలోని 'ది మదర్స్ ఇంటర్నేషనల్ స్కూల్'లో చదువుకున్న సెజల్ కుమార్‌కు చిన్నప్పటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. తండ్రి ఆర్మీ మేజర్. దిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో ఎకనామిక్స్‌లో డిగ్రీ చేసింది. టర్కీకి వెళ్లినప్పుడు 'సమ్మర్ స్టైల్' పేరుతో తొలి వీడియో అప్‌లోడ్ చేసింది. ఆ తరువాత సొంతంగా యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది.చానల్ కోసం చేసిన అయిదు వందలకు పైగా వీడియోలు బాగా పాపులర్ అయ్యాయి.

'ఇండియన్ గర్ల్ బ్యాక్‌ప్యాకింగ్ ఇన్ యూరప్' సిరీస్‌కు మంచి స్పందన లభించింది. సెజల్ తల్లి గైనకాలజిస్ట్. 'ఒక గైనకాలజిస్ట్‌ను అమ్మాయిలు అడగాలనుకునే సందేహాలపై వీడియోలు చేయవచ్చు కదా' అని చానల్ ప్రేక్షకులలో ఒకరు అడిగారు. ఆమె కోరిక మేరకు సెజల్ తల్లితో కలిసి చేసిన 'మామ్ అండ్ మీ' సిరీస్ బాగా పాపులర్ అయింది. ఎలాంటి ప్రశ్న అయినా స్వేచ్ఛగా, నిస్సంకోచంగా అడిగే వాతావరణాన్ని 'మామ్ అండ్ మీ' కల్పించింది.

సెజల్‌కు బాగా నచ్చే సబ్జెక్ట్‌లలో ఫ్యాషన్ ఒకటి. స్ట్రీట్ స్టైల్, స్ట్రీట్ వీడియోలపై మంచి పట్టు ఉంది. తన చానల్ 1 మిలియన్ ఫాలోవర్ మార్క్‌ను చేరుకున్నప్పుడు 'ఓ మై గాడ్' అనుకుంది ఆనందంగా. 'ఇదంతా నేను సొంతంగా సాధించాను' అనే ఆనందం సెజల్‌కు మరింత శక్తిని, ఉత్సాహాన్ని ఇచ్చింది. తన గొంతులోని ఛార్మింగ్ క్వాలిటీతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. యూట్యూబర్‌గా సెజల్ విజయరహస్యం ఏమిటి? ఆమె మాటల్లో...'మొదటి సూత్రం...గుడ్‌క్వాలిటీ కంటెంట్. గత వీడియో కంటే తాజా వీడియో ఎంతో కొంత బాగుండాలి. రెండో సూత్రం...ఎప్పుడో ఒకప్పుడు కాకుండా నిరంతరం ఏదో ఒక వీడియో పోస్ట్ చేస్తుండాలి. మూడో సూత్రం...ప్రేక్షకులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉండాలి. మనల్ని మనం అప్‌డేట్ చేసుకోవాలి. వారికి ఎలాంటి వీడియోలు కావాలో తెలుసుకోవాలి'



సెజల్ కుమార్

సెజల్ యూట్యూబ్ చానల్ ప్రేక్షకులలో మహిళలు ఎక్కువ. పద్దెనిమిది నుంచి ఇరవైనాలుగు ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు ఉంటారు. 'ఒక కాలేజీ స్టూడెంట్ నా దగ్గరకు వచ్చి మీ పేరుతో కనిపించే వీడియో కనిపిస్తే చాలు క్షణం ఆలస్యం చేయకుండా చూస్తాను అని చెప్పింది. ఆమె మాటలు విన్న తరువాత మరింత కష్టపడాలి అనిపించింది' అంటుంది సెజల్. 'కాళీ కాళీ' మ్యూజిక్ ట్రాక్ సింగర్‌గా ఆమె ప్రతిభకు అద్దం పట్టింది. ఎన్నో వ్యాపారప్రకటనల లో నటించిన సెజల్...'కలలను నిజం చేసుకునే విషయంలో అధైర్యం వద్దు. మనపై మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి' అంటుంది.

జైపూర్‌లోని మణిపాల్ యూనివర్శిటీలో 'హౌ టు మేక్ యూట్యూబ్ ఏ కెరీర్?' అనే అంశంపై సెజల్ చేసిన ప్రసంగం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తి ఇచ్చి ముందుకు నడిపించింది.

● ఇంగ్లిష్ ఇడియమ్



వన్ హార్స్ టౌన్
చాలా చిన్న టౌన్ అని అర్థం

టేక్ సమ్‌వన్స్ వర్డ్ ఫర్ ఇట్
ఒక విషయాన్ని ఎలాంటి ఆధారం లేకపోయినా ఆమోదించడం.

గెట్ డౌన్ టు బ్రాస్ ట్యాక్స్
ఒక విషయానికి సంబంధించి ముఖ్యమైన చర్చను స్టార్ట్ చేయడం.



తన కుటుంబంతో హర్ష్ అగర్వాల్

● సక్సెస్ స్టోరీ

స్టార్ ఫ్యాషన్ డిజైనర్



ఫ్యాషన్ డిజైనర్‌కు రెండు కళ్లతో పాటు మూడో కన్ను ఉండాలి. ఆ కన్ను చారిత్రక,సాంస్కృతిక వైభవాన్ని చూడగలగాలి. కాలంతో పాటు నడుస్తూనే ముందు కాలాన్ని చూడగలగాలి. జైపూర్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనర్ హర్ష్ అగర్వాల్‌కు ఈ సామర్థ్యం ఉంది. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన 27 సంవత్సరాల హర్ష్ అగర్వాల్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్'తో అంతర్జాతీయ స్థాయిలో గెలుపు జెండా ఎగరేశాడు....

రెండు సంవత్సరాల క్రితం...ఆరోజు హర్ష్ అగర్వాల్ ఫ్యాషన్ లేబుల్ ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్‌కు నోటిఫికేషన్‌ల వరద మొదలైంది. పాపులర్ ఇంగ్లిష్ సింగర్ హారీ స్టైల్స్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్' ధరించి ఉన్న ఫొటోలు అవి. జైపూర్ ఫ్యాషన్ బ్రాండ్ అంతర్జాతీయ స్థాయిలో వెలిగిపోతుంది అని చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే.

'ఇలా ఉండాలి. అలా ఉండాలి' అంటూ చిన్నప్పుడు తన దుస్తులను తానే డిజైన్ చేయించేవాడు హర్ష్.

'ఎకనామిక్స్ అండ్ బిజినెస్'లో పట్టా పుచ్చుకున్న హర్ష్ వేరే దారిలో ప్రయాణిస్తానని ఊహించలేదు. 'ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్' ఇంటర్న్‌షిప్ న్యూయార్క్‌లో చేస్తున్న రోజుల్లో 'ఫ్యాషన్' అనే మాట ఎక్కడ వినబడితే తాను అక్కడ ఉండేవాడు. పేరున్న ఫ్యాషన్ డిజైనర్‌లతో ముచ్చటించేవాడు. ఈ క్రమంలో తనకు సొంతంగా ఏదైనా చేయాలనిపించేది.

ఇండియాకు తిరిగివచ్చిన తరువాత...పశ్చిమ బెంగాల్ నుంచి గుజరాత్ వరకు ఎన్నో ప్రాంతాలకు వెళ్లి మన చేనేతకళావైభవాన్ని రెండు కళ్లలో పదిలపరుచుకున్నాడు. వాటి నుంచి స్ఫూర్తి తీసుకొని తల్లి, సోదరితో కలిసి 'హరగో హ్యాండ్స్' అనే మెన్స్‌వేర్ లేబుల్‌కు శ్రీకారం చుట్టాడు.

ముగ్గురితో మొదలైన 'హరగో'లో ఇప్పుడు 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ టీమ్‌లో టైలర్‌లు, జూనియర్ డిజైనర్‌లు, ప్రొడక్షన్ ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

'హస్తకళలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలనుకున్నాను. మన దేశానికి తనదైన గొప్ప సాంస్కృతిక, శిల్పకళావైభవం ఉంది. అది చేతి వృత్తి కళాకారుల పనిలో ప్రతిఫలిస్తుంది. అలాంటి వారికి సహాయంగా నిలవాలనుకున్నాను' అంటాడు హర్ష్ అగర్వాల్.

ఒక డిజైన్ హిట్ అయిన తరువాత దాని వెంటే పయనించడం అని కాకుండా ఎప్పటికప్పుడు కొత్త కొత్త డిజైన్‌లపై వర్క్ చేస్తుంటాడు హర్ష్. ప్రతి రోజు ఒక కొత్త శాంపిల్ రూపొందిస్తాడు. 105 పీస్‌లు రెడీ కాగానే ప్రీ-ఆర్డర్స్ కోసం సోషల్ మీడియా పేజీలలో ప్రకటిస్తాడు.

కోవిడ్ కల్లోలం సద్దుమణిగిన తరువాత కొత్త కలెక్షన్ కోసం ఇంటర్నేషనల్ బయర్స్ నుంచి ఆర్డర్లు వెల్లువెత్తాయి. లేబుల్ క్లాతింగ్ రిటైలర్‌లలో మ్యాచెస్ ఫ్యాషన్-లండన్, సెసెన్స్(మాంట్రియల్), ఎల్‌ఎమ్‌డీఎస్-షాంఘై, బాయ్‌హుడ్-కొరియా...మొదలైనవి ఉన్నాయి.

'హరగో'కు ఇది టిప్పింగ్ పాయింట్‌గా మారింది. బ్రాండ్ అభిమానుల్లో ఇంగ్లాండ్‌కు చెందిన టెలివిజన్ హోస్ట్, ఫ్యాషన్ డిజైనర్ టాన్ ఫ్రాన్స్ ఉన్నాడు.

'కొన్ని నెలల క్రితం హర్ష్ బ్రాండ్ గురించి విన్నాను. నా నెట్‌ఫ్లిక్స్ షో కోసం అతడు డిజైన్ చేసిన దుస్తులు ధరించాను. కొత్తగా, కంఫర్ట్‌గా అనిపించాయి. డిజైనింగ్‌లో హర్ష్‌కు తనదైన నేర్పు ఉంది' అంటున్నాడు టాన్ ఫ్రాన్స్.

హర్ష్ కొత్త కలెక్షన్ డిజైన్ స్కెచ్‌లతో మొదలు కాదు. నేతకళాకారులతో ముచ్చటించిన తరువాత ఒక ఐడియా వస్తుంది. దాన్ని మెరుగులు దిద్దడంపై దృష్టి పెడతాడు. 'హర్ష్ వర్క్‌లో క్వాలిటీ మాత్రమే కాదు క్లాసిక్ లుక్ కనిపిస్తుంది' అంటుంది టెక్స్‌టైల్ ఇనోవేషన్ ప్రాజెక్ట్ 'అంబు' ఫౌండర్ హేమ ష్రాఫ్ పటేల్.

యువర్స్

● టెక్.. టాక్

హువావే నోవా 11 ప్రో



● డిస్‌ప్లే: 6.78 అంగుళాలు ● రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జడ్ ● బ్యాటరీ: 4500 ఎంఏహెచ్ ● ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ +8 ఎంపీ ● ర్యామ్: 8జీబి ● రిజల్యూషన్: 1200x2652 పిక్సెల్స్ ● ఇంటర్నల్ మెమోరీ: 256 జీబి ● ఆపరేటింగ్ సిస్టమ్: హామని వోఎస్ ● బరువు: 188 గ్రా. ● కలర్స్: లుమినస్ గోల్డ్, డాన్ గోల్డ్, స్నోవీ వైట్

నాయిస్ ఫిట్ ట్విస్ట్ ప్రో స్మార్ట్‌వాచ్



● డిస్‌ప్లే: 1.4 అంగుళాలు ● ఫీచర్: బ్లూటూత్ కాలింగ్ మెటాలిక్ డయల్ ● హెల్త్ మానిటర్స్: హార్ట్‌రేట్, బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ సెన్సర్, స్లీప్ ట్రాకర్... మొదలైనవి. ● వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెంట్ ● 120 స్పోర్ట్స్ మోడ్స్ ● బ్యాటరీ: 300 ఎంఏహెచ్

టేబుల్ టాప్ స్టాండ్



బ్రాండ్: స్వాప్‌కార్ట్
కలర్: మల్టీ కలర్
కంపాటబుల్: ఆల్ స్మార్ట్‌ఫోన్స్ ప్రొడక్షన్ డైమెన్షన్స్: 16x10x4 సెంటీ మీటర్
ఫీచర్స్: ఫ్లెక్సిబుల్, ఫోల్డబుల్ ఆర్మ్
మెటీరియల్: అల్యూమినీయం
బరువు: 240 గ్రా.

గూగుల్ ఫొటోస్‌లో కొత్త ఎఫెక్ట్‌లు...



ఫొటో అండ్ వీడియో వ్యూయింగ్ యాప్ 'గూగుల్ ఫొటోస్'లో ఫిక్స్ లైటింగ్, మ్యాజిక్ ఎరేజర్‌లాంటి ఎన్నో ఉపయోగకరమైన ఫీచర్లు ఉన్నాయి. తాజాగా త్వరలో రాబోతున్న 12 కొత్త ఎఫెక్ట్‌ల గురించి ప్రకటించింది గూగుల్. అవి ఏమిటంటే... బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్, లోమో, డస్ట్ మిక్స్, పేపర్ టియర్, లైట్ లీక్, ఫిల్మ్ మూడ్, ఫిష్ ఐ, క్రోమటిక్, వింటేజ్, లేబొట్స్, పోస్టర్ అండ్ రెట్రో ఫిల్మ్.

● గేమింగ్: నేడే విడుదల

వస్తున్నారహో!



ఊహించని ఉపద్రవం... కలలో కూడా చూడని క్రూర జంతుసమూహం... అడుగు తీసి అడుగు వేస్తే ప్రమాదం. ఎక్సోప్రైమల్‌లో ఎన్నో సవాళ్లు మీ కోసం ఎదురుచూస్తున్నాయి. థర్డ్-పర్సన్ షూటర్‌గేమ్ ఎక్సోప్రైమల్ నేడు విడుదల అవుతుంది. ఈ మల్టీప్లేయర్ యాక్షన్ గేమ్‌లో ప్లేయర్ డైనోసర్‌లతో పాటు ఎన్నో అపరిచిత మృగాలతో పోరాడవలసి ఉంటుంది. ప్లేయర్-వర్సెస్-ప్లేయర్-వర్సెస్ ఎన్విరాన్‌మెంట్ వీడియో గేమ్ ఇది. ప్లేయర్ ఎక్సోఫైటర్‌ను కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. ఈ గేమ్‌లో ఎన్నో రకాలైన వెపన్స్ ఉంటాయి. గేమ్‌లోని మెయిన్ మోడ్ డినో సర్వైవల్. 'ఎక్సోప్రైమల్'ను యాక్షన్ గేమ్‌గా తీర్చిదిద్దింది జపాన్‌కు చెందిన వీడియోగేమింగ్ కంపెనీ క్యాప్‌కామ్.

ఇంజిన్: ఆర్‌ఈ ఇంజిన్ ; జానర్: థర్డ్ పర్సన్ షూటర్ ; ప్లేస్టేషన్స్: ప్లే స్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

ఐ వాన్న వాకౌట్



పూజా హెగ్డే

● రష్మికా మందన్నా

ఒక్క చాన్స్ వచ్చేవరకే ఎవరైనా ఆ చాన్స్ కోసం కష్టపడాలి. ఆ ఒక్క చాన్స్ బంపర్ చాన్స్ అయితే ఆ తర్వాతి చాన్సులు అవే వస్తాయి. ఇందుకు ఓ ఉదాహరణ పూజా హెగ్డే, రష్మికా మందన్నా. స్టార్ హీరోయిన్లుగా ఈ ఇద్దరూ తెలుగు, తమిళ, హిందీ చిత్రాలు చేస్తూ దూసుకెళుతున్నారు. చివరికి ఈ ఇద్దరూ డేట్స్ సర్దుబాటు చేయలేక సినిమాలు వదులుకునేంత బిజీ. అటు హిందీకి వెళితే ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ కూడా ఈ మధ్య ఒక సినిమా వదులుకున్నారు. 'నో డేట్స్.. ఐ వాన్న వాకౌట్' అంటూ ఈ నలుగురూ వదులుకున్న చిత్రాల గురించి, పూజ-రష్మిక వాకౌట్ చేయడం వల్ల ఆ ప్లేస్‌ని రీప్లేస్ చేయడానికి దర్శక-నిర్మాతలు పరిశీలిస్తున్న హీరోయిన్ గురించి తెలుసుకుందాం.

గుంటూరు కారం మిస్

'ఒక లైలా కోసం'తో (2014) తొలిసారి తెలుగు తెరపై మెరిశారు పూజా హెగ్డే. ఆ తర్వాత వరుస సినిమాలతో ఇక్కడ ఫుల్ బిజీ. అటు తమిళ, హిందీ నుంచి అవకాశాలు దక్కించుకున్నారు. ఇలా బిజీగా ఉన్న పూజ ఇటీవల డేట్స్ సర్దుబాటు చేయలేక 'గుంటూరు కారం' నుంచి తప్పుకున్నారని ఆమె వ్యక్తిగత సిబ్బంది పేర్కొన్న విషయం తెలిసిందే. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. త్రివిక్రమ్‌తో 'అరవింద సమేత వీర రాఘవ', 'అల.. వైకుంఠపురములో' వంటి హిట్ చిత్రాల్లో నటించారు పూజ. 'గుంటూరు కారం' నుంచి వాకౌట్ చేయకపోయి ఉంటే ఈ ఇద్దరి కాంబోలో ఇది మూడో సినిమా అయ్యుండేది. అలాగే 'మహర్షి' వంటి హిట్ తర్వాత మహేశ్‌బాబు-పూజ కాంబోలో రెండో సినిమా అయ్యుండేది. అయితే 'గుంటూరు కారం' నుంచి పూజ తప్పుకున్నప్పటికీ సూర్యదేవర నాగవంశీతో కలిసి త్రివిక్రమ్ భార్య సాయి సౌజన్య నిర్మించనున్న చిత్రంలో ఈ బ్యూటీ నటించే చాన్స్ ఉందట. సాయిధరమ్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో రూపొందించనున్న చిత్రానికి పూజని హీరోయిన్‌గా తీసుకోవాలని నాగవంశీ, సాయి సౌజన్య అనుకున్నారట. పూజని సంప్రదించారని సమాచారం. అయితే ఇంకా ఆమె కథ వినలేదట.

నితిన్ సినిమా మిస్

'ఛలో'తో తెలుగుకి పరిచయమయ్యారు రష్మికా మందన్నా. ఈ సినిమాలో సింపుల్ గాళ్‌గా ఎంట్రీ ఇచ్చి, స్టార్‌గా ఎదిగారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ సినిమాలు చేస్తున్నారీ బ్యూటీ. ప్రస్తుతం 'పుష్ప 2', 'రెయిన్ బో'తో పాటు మరో తెలుగు సినిమా, హిందీ చిత్రాలతో రష్మిక ఫుల్ బిజీ. అందుకే నితిన్ సరసన ఒప్పుకున్న చిత్రానికి కాల్‌షీట్స్ అడ్జెస్ట్ చేయలేకపోయారట. తెలుగులో రష్మిక ఎంట్రీ ఫిల్మ్ 'ఛలో' దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. తొలి హిట్ ఇచ్చిన దర్శకుడితో 'భీష్మ' వంటి రెండో హిట్ కూడా అందుకున్నారు రష్మిక. సో... వెంకీ కుడుములతో మూడో సినిమాని రష్మిక మిస్ అయ్యారు.



● అనుష్కా శర్మ



● కియారా అద్వానీ

ఒకరు వదులుకున్న చాన్స్ ఆటోమేటిక్‌గా వేరొకరికి దక్కడం సహజం. అలా 'గుంటూరు కారం' నుంచి పూజా హెగ్డే తప్పుకోవడం శ్రీలీలకి, మీనాక్షీ చౌదరికి ప్లస్ అయింది. ముందు ఈ చిత్రంలో శ్రీలీలను రెండో హీరోయిన్‌గా అనుకున్నారు. కానీ పూజ తప్పుకోవడంతో ఆమె మెయిన్ హీరోయిన్ అయ్యారు. శ్రీలీల స్థానంలోకి మీనాక్షీ చౌదరి వచ్చారు. అలాగే నితిన్ సినిమా నుంచి రష్మికా మందన్నా తప్పుకోవడంతో ఆ చాన్స్ కూడా శ్రీలీలకే వెళ్లనుందని టాలీవుడ్ టాక్. అటు హిందీ 'జీ లే జరా' విషయానికొస్తే.. ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ తప్పుకోవాలనుకోవడంతో అనుష్కా శర్మ, కియారా అద్వానీ వంటి నాయికల పేర్లను పరిశీలిస్తున్నారట ఫర్హాన్ అక్తర్.

నిజానికి 'భీష్మ' సినిమాతో నితిన్-రష్మిక హిట్ పెయిర్ అనిపించుకున్నారు. ఒకవేళ రష్మిక డేట్స్ అడ్జెస్ట్ చేయగలిగితే మరోసారి ఈ జంట సిల్వర్ స్క్రీన్‌పై కనిపించేది.



● మీనాక్షీ చౌదరి ● శ్రీలీల



● కత్రినా కైఫ్



● ప్రియాంకా చోప్రా



● ఆలియా భట్

రీప్లేస్ చేసేది ఎవరు?

బాలీవుడ్‌లో ఈ మధ్య ప్రకటించిన చిత్రాల్లో 'జీ లే జరా' అందరి దృష్టినీ ఆకర్షించింది. దానికి కారణం ఇది లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ కావడం, చిత్రదర్శకుడు ఫర్హాన్ అక్తర్ కథానాయికలుగా ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్‌లను ఎన్నుకోవడం. అయితే హాలీవుడ్ ప్రాజెక్ట్స్ వల్ల ఈ చిత్రాన్ని 2024లో ఆరంభించాలని ఫర్హాన్‌ని ప్రియాంక కోరారట. ఫర్హాన్ ఓకే చెప్పారని టాక్. ఈలోపు కత్రినా వేరే ప్రాజెక్ట్స్ ఒప్పుకోవడంతో ఈ చిత్రానికి డేట్స్ సర్దుబాటు చేయలేనన్నారట. కాగా 'సిటాడెల్ 2' స్టార్ట్ అయ్యే చాన్స్ ఉన్నందున టోటల్‌గా ఈ సినిమా నుంచి వాకౌట్ చేయాలని ప్రియాంక నిర్ణయించుకున్నారట. కత్రినా కూడా ఇదే నిర్ణయం తీసుకున్నారని సమాచారం.



● 'హాయ్ నాన్న' పోస్టర్

హాయ్ నాన్న

నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'హాయ్ నాన్న' అనే టైటిల్ ఖరారు చేశారు. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ఈ చిత్రానికి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 'హాయ్ నాన్న' అని, హిందీలో 'హాయ్ పప్పా' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఫస్ట్ లుక్, గ్లింప్స్‌ను విడుదల చేశారు. ''తండ్రీ-కూతురు భావోద్వేగాలతో కూడిన ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. యూనిక్ స్టోరీ లైన్‌తో రూపొందుతున్న ఈ చిత్రం అన్ని భాషలవారికీ కనెక్ట్ అవుతుంది. ఈ ఏడాది డిసెంబర్ 21న చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

మహారాజా రెడీ



● విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి కెరీర్‌లో 50వ మైలురాయిగా తెరకెక్కిన చిత్రం 'మహారాజా'. నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించారు. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, నట్టి నటరాజ్ కీలక పాత్రలు పోషించారు. ప్యాషన్ స్టూడియోస్ సుధన్ సుందరం, ది రూట్-థింక్ స్టూడియోస్ జగదీష్ పళనిసామి సమర్పణలో రూపొందిన ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది.

నార్నే నితిన్ కొత్త సినిమా షురూ



● అల్లు అరవింద్, నయన్ సారిక, నార్నే నితిన్

హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా కొత్త సినిమా షురూ అయింది. అంజిబాబు కంచిపల్లి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ 2 పిక్చర్స్‌పై బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ చిత్రం గురువారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకుడు మారుతి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందించారు. ''జీఏ 2 బ్యానర్‌లో ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సహనిర్మాత: ఎస్‌కేఎన్, కెమెరా: సమీర్ కళ్యాణ్, సంగీతం: రామ్ మిర్యాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: భానుప్రతాప్, రియాజ్ చౌదరి, అజయ్ గద్దె.

మిస్టర్ ప్రెగ్నెంట్ డేట్ ఫిక్స్

'బిగ్ బాస్' ఫేమ్ సయ్యద్ సోహైల్ రియాన్ హీరోగా నటించిన 'మిస్టర్ ప్రెగ్నెంట్' విడుదల తేదీ ఖరారైంది. ఆగస్టు 18న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రూపా కొడవాయూర్ హీరోయిన్‌గా నటించారు. అప్పిరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించారు. ''ఈ చిత్రంలో సోహైల్ ప్రెగ్నెంట్‌గా కనిపించనున్నాడు. తెలుగు తెరపై ఇదొక కొత్త తరహా ప్రయత్నం. వైవిధ్యమైన సినిమాలకు ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో మా 'మిస్టర్ ప్రెగ్నెంట్' సక్సెస్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: శ్రవణ్ భరద్వాజ్.



● సయ్యద్ సోహైల్, రూపా కొడవాయూర్

నా చివరి సినిమాని బలమైన కథతో చేయాలనుకున్నా!

- ఉదయనిధి స్టాలిన్



''నాయకుడు' చాలా మంచి కథ, పొలిటికల్ డ్రామా, సామాజిక న్యాయం, ప్రజల మధ్య సమానత్వం గురించి ఈ మూవీలో చర్చించాం. యూనివర్సల్ అప్పీల్ ఉన్న ఈ కథ తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుంది'' అని ఉదయనిధి స్టాలిన్ అన్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'మామన్నన్'. ఉదయనిధి స్టాలిన్ హీరోగా నటించి, నిర్మించారు. కీర్తి సురేష్ హీరోయిన్. జూన్ 29న ఈ చిత్రం విడుదలైంది. తెలుగులో 'నాయకుడు' పేరుతో ఏషియన్ మల్టీప్లెక్స్, సురేష్ ప్రొడక్షన్స్ విడుదల చేస్తున్నాయి. నేడు ఈ మూవీ రిలీజవుతోంది. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ-''తెలుగులో నా గత చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. అందుకే ఈ సినిమాను తమిళంలో మాత్రమే విడుదల చేయాలనుకున్నాం. అయితే తమిళంలో మంచి వసూళ్లను సాధించడంతో ఏషియన్, సురేష్ ప్రొడక్షన్స్ తెలుగులో విడుదల చేస్తున్నారు. నేను సినిమాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాక నా చివరి సినిమాని బలమైన కథతో మారి సెల్వరాజ్‌తో చేయాలనుకున్నాను'' అన్నారు.